క్లుప్తంగా

శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి అభిషేకం

పాల్వంచరూరల్: మండలంలోని పెద్దమ్మతల్లి ఆలయ సముదాయం శివాలయంలో కొలువైన శ్రీ సుబ్రమణ్యేశ్వర స్వామికి మంగళవారం అర్చకులు పంచామృతంతో అభిషేకం నిర్వహించారు. ఆ తరువాత హారతి, నివేదన సమర్పించారు. కాగా, ఆలయంలో ఈనెల 7న చండీ హోమం నిర్వహించనున్నట్లు ఈఓ ఎన్.రజనీకుమారి తెలిపారు. హోమం పాల్గొనే భక్తులు రూ.2,516 చెల్లించి గోత్రనామాలు నమోదు చేసుకోవాలని, వివరాలకు 63034 08458 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

మంత్రి పొంగులేటికి స్వాగతం

ఇల్లెందు: రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మంగళవారం కొత్తగూడెం వెళ్తున్న క్రమాన ఇల్లెందులో కాసేపు ఆగారు. మహబూబాబాద్ నుంచి వెళ్తున్న మంత్రి ఇల్లెందులోని ఎమ్మెల్యే కోరం కనకయ్య క్యాంపు కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు ఆయనకు స్వాగతం పలకగా పలు అంశాలపై చర్చించారు. కాంగ్రెస్ పట్టణ, మండల అధ్యక్షులు దానియేల్, పులి సైదులు, నాయకులు జానీపాషా, మడుగు సాంబమూర్తి, శ్రీనివాస్, యదళ్లపల్లి అనసూర్య, కల్తీ పద్మ, స్వరూప, నిర్మల, మోకాళ్ల వెంకటమ్మ పాల్గొన్నారు.

విధుల్లో చేరిన డైరెక్టర్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో డైరెక్టర్ ఈఅండ్ఎంగా నూతనంగా ఎంపికైన తిరుమలరావు మంగళవారం కొత్తగూడెంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా అన్నిశాఖల జనరల్ మేనేజర్లు, అధికారులు, సీఎంఓఏఐ అధికారులు, యూనియన్ నాయకులు, ఉద్యోగులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

అటవీ అధికారులపై చర్యలు తీసుకోవాలి

సింగరేణి(కొత్తగూడెం): చేతికొచ్చిన పంటలను ధ్వంసం చేస్తున్న అటవీశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని న్యూడెమొక్రసీ నాయకుడు గౌని నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. కొత్తగూడెంలోని ఇఫ్టూ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ 20 ఏళ్లకు పైగా ఆదివాసీలు పంటలు సాగు చేస్తుండగా, ఈసారి ఆ భూముల్లో పంటలను ధ్వంసం చేశారని ఆరోపించారు. అంతేకాక ఆదివాసీలపైనే కేసులు నమోదు చేయడం గర్హనీయమన్నారు. అధికారులపై చర్యలు తీసుకుని రైతులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

జేకే ఓసీకి అవార్డులు

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియా జేకే–5 ఓసీకి అవార్డులు లభించటం పట్ల ఏరియా జీఎం వీసం కృష్ణయ్య హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం జేకే ఓసీలో జరిగిన సభలో ఉద్యోగులు, కార్మికులను అభినందించారు. కార్యక్రమంలో ఓసీ మేనేజర్ పులి పూర్ణచందర్, శివప్రసాద్, ఇక్బాల్ షరీఫ్, పైడి రాజు, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్ ముట్టడి

టేకులపల్లి: భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విద్యార్థులు, మేధావులు విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బయ్య అభిమన్యు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. సత్వరమే విద్యా సమస్యలు పరిష్కరించకపోతే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

బ్యాగులు, పెన్నులు పంపిణీ

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం రైల్వే పోలీసు, ట్రైన్ లోకో పైలట్‌ల ఆర్థిక సహకారంతో మంగళవారం బేతంపూడి పాఠశాలలో విద్యార్థులకు బ్యాగులు, పెన్నులు, పెన్సిళ్లు, పండ్లు పంపిణీ చేశారు. కొత్తగూడెం రైల్వే ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ టీవీఆర్ కృష్ణ, ట్రైన్ డ్రైవర్ ఉపేందర్, సుబ్రహ్మణ్యం, ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీఎఫ్ కానిస్టేబుళ్లు అశోక్, మధుకర్ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్మికుల సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలని సీఐటీయూ కార్యదర్శి విజయగిరి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యేల దృష్టికి తీసుకెళ్లడంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు విఫలమయ్యాయని ఆరోపించారు. కాగా, కార్మికులకు సొంత ఇళ్లు కావాలా, కంపెనీ క్వార్టర్ కావాలా అన్న అంశంపై ఈనెల 11, 12వ తేదీల్లో నిర్వహించే ఓటింగ్‌లో పాల్గొనాలని ఆయన ఓ ప్రకటనలో కోరారు.

చదువుతోపాటు ఆటలూ ముఖ్యమే

ఇల్లెందు: విద్యార్థులు చదువుతో పాటు ఆటపాటల మీద దృష్టి సారించాలని, విద్య ఎంత అవసరమో ఆటపాటలు కూడా అంతే అవసరం అని ఎస్ఓటూ జీఎం రామస్వామి, డీజీఎం పర్సనల్ తుకారాం అన్నారు. మంగళవారం జేకే సింగరేణి హైస్కూల్ గ్రౌండ్‌లో పాఠశాలల మండల స్థాయి క్రీడాపోటీలను వారు ప్రారంభించారు. మాట్లాడుతూ క్రీడల ద్వారా ఎంతో మంది ఉన్నత స్థాయిలో ఉన్నట్లు చెప్పారు.

మరువలేని నాయకుడు వైఎస్

చరిత్ర మరువని నాయకుడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి అని, అందరూ ఆయన అడుగుజాడల్లో నడవాలని నాయకులు పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి 16వ వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వాస్పత్రుల్లో పండ్లు, పాలు పంపిణీ చేశారు. వక్తలు మాట్లాడుతూ... వైఎస్సార్ అనేక సంక్షేమ పథకాలతో పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని కొనియాడారు. – సాక్షి నెట్‌వర్క్



పాల్వంచరూరల్: దంతలబోరులో..



సుజాతనగర్: వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



జూలూరుపాడు: నివాళులర్పిస్తున్న నాయకులు, కార్యకర్తలు, అభిమానులు



కొత్తగూడెంఅర్బన్: వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న కాంగ్రెస్ నాయకులు



ఇల్లెందు: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద..



పాల్వంచ: బస్టాండ్ సెంటర్‌లో..



టేకులపల్లి: సులానగర్ పీహెచ్‌సీలో పండ్లు, బ్రెడ్ పంపిణీ చేస్తున్న నాయకులు



ఇల్లెందు: నివాళ్ళర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

సీఎంకు బీజేపీ బహిరంగ లేఖ

చుంచుపల్లి: కాంగ్రెస్ ప్రజాపాలనలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జరిగిన అభివృద్ధి శూన్యమని బీజేపీ నాయకులు మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగలేఖ రాశారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా ఈ ప్రాంతం రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, పాల్వంచలో విద్యుత్ ప్లాంట్‌ను అభివృద్ధి చేయకపోవడాన్ని ప్రశ్నించారు. అపారమైన ఖనిజ సంపద, నీటి వసతులకు అనువైన ప్రాంతం అయినప్పటికీ అభివృద్ధిలో ఈ ప్రాంతం అట్టడుగులో ఉందని విమర్శించారు. కొత్తగూడెం పట్టణంలో రూ.కోట్ల ప్రజాధనం దుర్వినియోగం అయిందని చెప్పినా, స్థానిక ఎమ్మెల్యేకు చెప్పినా పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఇంకా పలు సమస్యలను ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో గొడుగు శ్రీధర్, పట్టణ అధ్యక్షుడు శీలం విద్యాసాగర్, బలగం శ్రీధర్, మాలోత్ గాంధీ, వెంకన్న, గుంపుల మహేష్, కృష్ణారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.



లేఖను విడుదల చేస్తున్న నాయకులు

విద్యా సమస్యలపై స్పందించండి..

సింగరేణి(కొత్తగూడెం): జిల్లాలోని విద్యా సమస్యల పరిష్కారానికి సీఎం స్పష్టమైన హామీ ఇవ్వాలని, ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం అధ్యక్షుడు మంద నాగకృష్ణ డిమాండ్ చేశారు. 3న సీఎం రేవంత్‌రెడ్డి జిల్లాలో పర్యటన సందర్భంగా మంగళవారం జరిగిన సంఘం ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. జూనియర్ కళాశాలలకు సరైన భవనాలు లేవని, ఉన్నవి శిథిలావస్థలో ఉన్నా యని, ప్రభుత్వ హాస్టళ్లలోని విద్యార్థులు సరైన వసతులు, భోజనం లేక అనారోగ్యం బారిన పడుతున్నట్లు చెప్పారు. పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలన్నారు. రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రిని నియమించకపోవటం గర్హనీయమని పేర్కొన్నారు.

ప్రజాసమస్యలపై సీఎం దృష్టి సారించాలి

జిల్లా పర్యటనకు వస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాసమస్యలపై దృష్టి సారించి పరిష్కారానికి హామీ ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు కోరారు. అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పూర్తి, పేదలకు ఇళ్ల పట్టాలు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, పోడు భూముల్లో విద్యుత్, సాగునీటి సౌకర్యం, మిగిలిన పోడుదారులకు హక్కుపత్రాల పంపిణీ, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో సదుపాయాల కల్పన, వైద్యుల నియామకం, సీతారామ ప్రాజెక్ట్ పనుల పూర్తి, భద్రాచలంలో కరకట్ట తదితర అంశాలపై సీఎం ప్రకటన చేయాలని పేర్కొన్నారు. అంతేకాక యువతకు ఉపాధి కల్పించాలని వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో కోరారు.

సరిపడా యూరియా అందించాలి

పాల్వంచ: రైతులకు సరిపడా యూరియా అందించాలని, యూరియా అందించలేని సీఎం రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలని పాల్వంచ కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కాంపెల్లి కనకేష్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు మంతపురి రాజుగౌడ్ అన్నారు. మంగళవారం స్థానిక సొసైటీ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. మాట్లాడుతూ రైతులు వరినాట్లు వేసుకుని 15 రోజులు అవుతోందని, పొలాలకు యూరియా వేసుకుందామంటే సక్రమంగా అందక ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. వందలాది మంది రైతులకు ఇంకా యూరియా దొరకలేదన్నారు. కేసీఆర్ ముందు చూపుతో ఆనాడు యూరియా కొరత లేకుండా అందించారని, ఏప్రిల్, మే నెలలో యూరియా కేటాయింపులు చేసే సమయంలో కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి రాష్ట్రానికి అవసరమైన కోటా తెప్పించినట్లు చెప్పారు. ఇప్పటికైనా వ్యవసాయ శాఖ అధికారులు స్పందించాలన్నారు. కార్యక్రమంలో కాలేరు సింధు తపస్వీ, భూక్యా చందు నాయక్, రంజిత్, హర్షవర్ధన్, ప్రసాద్, రాఘవేంద్ర, అరుణ్, అఖిల్ మహర్షి, నయీం, సునీత, ముఖేష్, సురేష్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం..

ఇల్లెందు: బీఆర్ఎస్ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన ఎమ్మెల్సీ కె.కవితను బీఆర్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు కేసీఆర్ ఆదేశం మేరకు పార్టీ నుంచి సస్పెండ్ చేయడాన్ని స్వాగతిస్తున్నామని వ్యవస్థాపక సభ్యుడు, మాజీ గ్రంథాలయ కమిటీ చైర్మన్ దిండిగల రాజేందర్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఇల్లెందులో ఆయన విలేకరులతో మాట్లాడారు. పార్టీ కోసం కన్న బిడ్డను కూడా వదులుకున్న గొప్ప నాయకుడు కేసీఆర్ అన్నారు.

సారొస్తేనే.. చురుకు

కొత్తగూడెంటౌన్/సింగరేణి(కొత్తగూడెం): సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం జిల్లా పర్యటను రానున్నారు. దీంతో అధికార యంత్రాంగానికి చురుకు తగిలింది. రామవరం రోడ్డు, గోధుమవాగు బ్రిడ్జి పైనుంచి అధికారులు ప్రయాణిస్తారని ఆఘమేఘాల మీద మంగళవారం వెట్ మిక్స్‌తో మరమ్మతు పనులు చేయిస్తున్నారు. నెలల తరబడి ప్రజలు ఎన్‌హెచ్, ఆర్అండ్‌బీ, కార్పొరేషన్ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా, ధర్నాలు చేసినా పట్టించుకోని అధికారుల తీరుపై స్థానికులు, ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రోడ్లు బాగుచేస్తున్నందుకు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



గోధుమవాగు బ్రిడ్జిపై మరమత్తు పనులు చేస్తున్న కార్పొరేషన్ సిబ్బంది

సింగరేణిలో రాజకీయ జోక్యం గర్హనీయం



ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) ఆధ్వర్యంలో కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించి, సింగరేణి డైరెక్టర్(పా) గౌతంపొట్రుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి టీబీజీకేఎస్ గౌరవాధ్యక్షుడు మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు, ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే హరిప్రియ, గ్రంథాలయ చైర్మన్ దిండిగల రాజేందర్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. మాట్లాడుతూ సింగరేణి సంస్థ 2024–25లో వాస్తవ లాభాలు వెల్లడించాలని, 35శాతం వాటా ప్రకటించాలని, పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారానికి యాజమాన్యం జాప్యం చేస్తోందన్నారు. సంస్థలో మునుపెన్నడూ లేని విధంగా రాజకీయ జోక్యం పెరిగిందని, కొత్త బొగ్గు గనులను తీసుకొచ్చే బాధ్యతను విస్మరించిందన్నారు. అధికార పార్టీ ఎమ్మెల్యేల కార్యాలయాల వద్ద సింగరేణి అధికారులు పడిగాపులు కాస్తున్నారని ఆరోపించారు. గుర్తింపు సంఘం, ప్రాతినిధ్య సంగం కార్మికుల హక్కులను కాపాడడంలో విఫలమయ్యాయన్నారు.

'ట్రంప్ సుంకాల నుంచి దేశాన్ని రక్షించండి..'

పాల్వంచ: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత్‌పై విధించిన సుంకాలు పెనుప్రభావాన్ని చూపిస్తున్నాయని, అమెరికా సామ్రాజ్యవాదాన్ని ఖండించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె.బ్రహ్మాచారి అన్నారు. మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక అల్లూరి సెంటర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశంతో పాటు రాష్ట్రానికి నష్టం జరగనుందని, రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. దొడ్డ రవికుమార్, కె.సత్య, గుర్రం రాములు, రాజేష్, కురమయ్య, శ్రీను, రాములు, రవీందర్, నాగమ్మ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రేపు ఆశా కార్యకర్తల మహాసభ

ఇల్లెందు: ఇల్లెందు పట్టణంలోని 4న జరగనున్న తెలంగాణ ఆశ కార్యకర్తల యూనియన్ మహాసభను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె.బ్రహ్మాచారి కోరారు. మంగళవారం ఇల్లెందులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకుని హక్కుల సాధన కోసం పోరాడుతామని తెలిపారు. ఎస్‌పె నబీ, తాళ్లూరి కృష్ణ, మల్లేశ్వరి, చీమల రమణ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి వినతి

జూలూరుపాడు: లంబాడీ హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్), గిరిజన విద్యార్థి సంఘం సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలోని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి నాయకులు వినతిపత్రం ఇచ్చారు. నాయకులు మాట్లాడుతూ.. ఎస్టీ జాబితా నుంచి బంజారా, లంబాడీలను తొలిగించాలని ఆదివాసీ నాయకులు సుప్రీంకోర్టులో పిటిషన్ వేయడం సరైంది కాదన్నారు. ఆదివాసీలు, లంబాడీల మధ్య చిచ్చు పెట్టాలని చూస్తే ఊరుకునేది లేదన్నారు. కార్యక్రమంలో మూడు బాలాజీ నాయక్, లకావత్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌హెచ్‌పీఎస్ నాయకుల అరెస్టు

ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులను మంగళవారం పోలీసులు అరెస్టు చేసి, పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తొలగించాలని ఆదివాసీ నాయకులు సుప్రీంకోర్టులో పిటిషన్ వేయడాన్ని వ్యతిరేకిస్తూ ఎల్‌హెచ్‌పీఎస్ నిరసనకు పిలుపు నివ్వడంతో నాయకులను ముందుస్తుగా పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో గుగులోత్ కేశ్య, రాంబాబు, భూక్యా చరణ్, భూక్యా శివ, తదితరులు ఉన్నారు.

కుట్రలపై సీఎం స్పందించాలి

కొత్తగూడెంటౌన్: లంబాడీలపై జరుగుతున్న కుట్రలపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించాలని ఐక్య సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం కొత్తగూడెం క్లబ్‌లో లంబాడీ ఐక్య సంఘాల నాయకుల సమావేశం జరిగింది. మాట్లాడుతూ.. చంద్రుగొండలో సీఎం కార్యక్రమం జరుగుతుండగా ఆందోళన చేయాలని పిలిపునిచ్చారు. భద్రాయలం ఎమ్మెల్యే లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని కోర్టుకు వెళ్లడం గర్హనీయమన్నారు. గుగులోతు రాజేష్, లక్ష్మణ్, లావుడ్యా ప్రసాద్, బానోతు వీరుక్, రాములు, వెంకటేశ్వర, జానకీరామ్, బానోతు శ్రీనివాస్, హతీరాం, మోహన్, బాలు, రవి రాథోడ్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న నాయకులు, విద్యార్థులు

కొత్తగూడెంఅర్బన్: పెండింగ్‌లో ఉన్న రూ.8,300 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలని, నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేసి విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ తలపెట్టిన కలెక్టరేట్ ముట్టడి మంగళవారం జరిగింది. విద్యార్థులు కలెక్టరేట్ లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. తోపులాట చోటు చేసుకోగా గేట్లు ఎక్కి నినాదాలు చేస్తూ ఏఐఎస్ఎఫ్ జెండాలు ప్రదర్శించారు. ఇటుకల రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యారంగంపై సవతి తల్లి ప్రేమ చూపిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉపాధ్యాయ, అధ్యాపకుల పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టరేట్ కార్యాలయ సిబ్బందికి అందజేశారు. వరక అజిత్, షాహిద్, గుండాల సుజన్, ఇనపెల్లి పవన్ సాయి, గుగులోత్ వంశీ పాల్గొన్నారు.

ముగిసిన దివ్యాంగుల నిర్ధారణ శిబిరం

కొత్తగూడెంఅర్బన్: సమగ్ర శిక్ష, జిల్లా విద్యా శాఖ, అలింకో ఆధ్వర్యంలో పాత కొత్తగూడెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దివ్యాంగుల పరికరాలు, ఉపకరణాల కోసం ఏర్పాటు చేసిన నిర్ధారణ శిబిరం మంగళవారంతో ముగిసిందని జిల్లా సమ్మిళిత విద్య కోఆర్డినేటర్ ఎస్‌కే సైదులు తెలిపారు. మూడు రోజుల్లో 23 మండలాల నుంచి వచ్చిన 305 మంది దివ్యాంగులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి, వారికి అవసరమైన పరికరాలు, ఉపకరణాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశామన్నారు.

గిరిజన రైతులపై దాడులు ఆపండి..

పాల్వంచరూరల్: నిరుపేద గిరిజన రైతుల పత్తిపంటలను ఫారెస్ట్ అధికారులు ధ్వంసం చేయడాన్ని ఆపాలని సీపీఐ నాయకుడు నిమ్మల రాంబాబు డిమాండ్ చేశారు. ఉల్వనూరు, చిరుతానిపాడు, మందేరకలపాడు, బంజర గ్రామాల పరిధిలో గిరిజన రైతులు సాగు చేసిన అటవీ అధికారులు ధ్వంసం చేసిన పత్తిపంటను మంగళవారం ఆయన పరిశీలించారు. మాట్లాడారు అధికారులు మానవత్వాన్ని మరిచి పూత, కాతకు వచ్చిన పత్తిపంటను ధ్వంసం చేయడం అన్యాయం అన్నారు. భూములకు పట్టాలు లేవని విత్తనాలు నాటే ముందే నిలిపివేయాల్సి అధికారులు రూ.వేల పెట్టుబడి పెట్టి చేతికొచ్చిన పంటలను ధ్వంసం చేయడం గర్హనీయమన్నారు. అధికారులు తీరు మార్చుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. వేములపల్లి శ్రీనివాసరావు, పూనెం రమేష్, చిల్లా కృష్ణ, గొగ్గెల బాబు, చిట్టిబాబు, ఎర్రయ్య పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారాలు మానుకోవాలి

పాల్వంచ: కాళేశ్వరం ప్రాజెక్ట్ విషయంలో కేసీఆర్, హరీష్‌రావులపై కాంగ్రెస్ ప్రభుత్వం అసత్య ప్రచారాలు మానుకోవాలని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు మంతపురి రాజుగౌడ్, సొసైటీ వైస్ చైర్మన్ కాంపెల్లి కనకేష్ అన్నారు. మంగళవారం అంబేద్కర్ సెంటర వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. మాట్లాడుతూ 2014లో తెలంగాణ ఏర్పడిన తర్వాత అప్పటి సీఎం కేసీఆర్ తెలంగాణను సస్యశ్యామలం చేయాలనే లక్ష్యంతో కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను నిర్మించినట్లు చెప్పారు. ఇప్పుడు కాళేశ్వరం పనికిరాదని బూచిగా చూపించి, గోదావరి జలాలను ఆంధ్రాకు తరలించి బనకచర్ల ప్రాజెక్ట్‌ను నిర్మించుకోవడానికి రాద్ధాంతం చేస్తున్నారని ఆరోపించారు. కాలేరు సింధు తపస్వీ, భూక్యా చందునాయక్, సంగ్లోతు రంజిత్, హర్షవర్ధన్, ప్రసాద్, రాఘవేంద్ర, అరుణ్, నయీం, నరేష్, సునీత, ముఖేష్, సురేష్, రంజిత్, షరీఫ్, రాజేశ్, జీవన్ పాల్గొన్నారు.

సీఐటీయూ సభను జయప్రదం చేయండి..

టేకులపల్లి: 4న ఇల్లెందు అయితా ఫంక్షన్ హాల్‌లో జరగనున్న తెలంగాణ ఆశా కార్యకర్తల యూనియన్ (సీఐటీయూ) జిల్లా మహాసభను జయప్రదం చేయాలని సంఘం జిల్లా నాయకుడు అబ్దుల్ నబీ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం సులానగర్ పీహెచ్‌సీలో ఆశా వర్కర్ల సమావేశంలో మాట్లాడారు.

ముగ్గురికి జైలు శిక్ష

కొత్తగూడెంటౌన్: బైక్‌పై గంజాయిని తరలిస్తూ పట్టుబడిన ముగ్గురికి మంగళవారం జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి ఎస్.సరిత జైలు శిక్ష విధిస్తున్నట్లు తీర్పు చెప్పారు. 2022, మార్చి 8న బైక్‌పై 17.5 కిలోల పొడి గంజాయిని తరలిస్తూ పాల్వంచకు చెందిన భూక్యా మహేశ్, చలపూరి శివకృష్ణ, చెన్ను మహేంద్ర ఎక్సైజ్, సివిల్ పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డారు. గంజాయి, వాహనాన్ని సీజ్ చేసి, పోలీసులు కేసు నమోదు చేసి, కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ముగ్గురు సాక్షులను విచారించిన జడ్జి ముగ్గురికి ఐదేళ్ల జైలుశిక్ష, రూ.2 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

జేసీబీ, ట్రాక్టర్ పట్టివేత

జూలూరుపాడు: అక్రమంగా సీతారామ కెనాల్ మట్టి తవ్వి, తరలిస్తున్న జేసీబీ, ట్రాక్టర్‌ను మంగళవారం రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. తహసీల్దార్ టి.శ్రీనివాస్ కథనం ప్రకారం.. రాజారావుపేట సమీపంలోని సీతారామ కెనాల్ మట్టిని జేసీబీతో తవ్వి, ట్రాక్టర్లలో తరలిస్తున్న సమాచారం మేరకు ఆర్ఐ ఆదినారాయణ.. సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి వెళ్లారు. జేసీబీ, ట్రాక్టర్‌ను స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి, మైనింగ్‌శాఖ అధికారులకు అప్పగించామని తహసీల్దార్ తెలిపారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తి మృతి



కృష్ణ (ఫైల్)

టేకులపల్లి: బైక్ అదుపు తప్పి వ్యక్తి కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. బోడు పోలీసులు తెలిపిన వివరాలు.. పాతలచ్చగూడెం గ్రామానికి చెందిన పూనెం కృష్ణ (30) మంగళవారం రాత్రి సంపత్‌నగర్ నుంచి బైక్‌పై స్వగ్రామానికి వస్తుండగా బైక్ అదుపు తప్పి చింతచెట్టుకు ఢీకొని తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న బోడు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.